సాక్షి మంచిర్యాల

సోమవారం । 3 । జూన్ । 2024



శ్రమ బారెడు.. వేతనం మూరెడు

సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నా వారిలో పావలావంతు వేతనం కూడా రావడంలేదు. 8లో▸



గనులపై 'దశాబ్ది' సంబురాలు

తెలంగాణ దశాబ్ది ఆవిర్భావ దినోత్సవాలను సింగరేణి బొగ్గు గనులపై ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. జీఎంలు, కార్మిక సంఘాల నాయకులు జాతీయ జెండాలు ఎగురవేశారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.9 /29.5

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత కొనసాగుతుంది. సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.


గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న బెటాలియన్ అధికారులు, సిబ్బంది

పోరు తెలంగాణ


శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శన


జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్ బి. సంతోష్, అధికారులు

- కలెక్టర్ బి.సంతోష్
- ఘనంగా రాష్ట్ర దశాబ్ది వేడుకలు

మంచిర్యాలఅగ్రికల్చర్: సకలజనుల పోరాటం, అమరుల త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రం తెలంగాణ అని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఆవిర్భావ వేడుకలను కలెక్టరేట్ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు మంచిర్యాల బైపాస్ రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, డీసీపీ అశోక్‌కుమార్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. తర్వాత సమీకృత కలెక్టరేట్


అమరవీరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ సంతోష్

ఆవరణలో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది వేడుకల్లో పాల్గొన్నారు. మహాత్మాగాంధీ, బీఆర్.అంబేద్కర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాల వేశారు. జాతీయ పతాకం ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. తర్వాత కలెక్టర్ మాట్లాడారు. ఎందరో మహానుభావులు, సాయుధ పోరాట వీరులు, మేధావులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు, కార్మిక సంఘాలు ముక్తకంఠంతో స్వరాష్ట్ర కాంక్షను వినిపించి ప్రత్యేక తెలంగాణ సాధించుకున్నట్లు వివరించారు. దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిర్మాణాత్మక ప్రణాళికలతో అన్నిరంగాల్లో అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ ఫలాలు అందించేందుకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈమేరకు అధికార యంత్రాంగం పారదర్శకంగా పనిచేస్తోందని చెప్పారు. అన్ని సామాజికవర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలు, అన్నిరంగాలకు సమ ప్రాధాన్యత ఇస్తూ సమ్మిళిత సమగ్రాభివృద్ధి సాధన దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తున్నామని వెల్లడించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి జాతీయ పతాకం ఎగురవేశారు. 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లోని కమాండెంట్ సయ్యద్ జమీల్ భాషా జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఉత్తమ సేవా, కఠిన సేవా పతకాలు అందుకున్న అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీవో రాములు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీపీ కార్యాలయంలో..


డీసీపీ కార్యాలయంలో జెండా వందనం..

మంచిర్యాలక్రైం/మందమర్రిరూరల్: మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీపీ అశోక్‌కుమార్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఏసీపీ ప్రకాశ్, సీఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో...


జెండా ఆవిష్కరిస్తున్న జడ్జి శ్రీనివాసులు

జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అటవీ శాఖలో...

సీఎఫ్‌వో కార్యాలయంలో సీఎఫ్‌వో శాంతరాం జాతీయజెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో శివ్‌ఆశిష్ సింగ్, ఎఫ్‌డీవోలు, ఎఫ్ఆర్‌వోలు, డీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖలో...

జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని స్థానిక జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కేజీ.నందగోపాల్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ గురువయ్య, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్

మంచిర్యాలలో గ్యాంగ్‌వార్

- బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శిపై దాడి
- నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాకేశ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో వరుస గ్యాంగ్ దాడులు కలకలం రేపుతున్నాయి. గత నెల 14న స్థానిక ఐబీ చౌరస్తాలోని మావిందు హోటల్ సమీపంలో జరిగిన గ్యాంగ్ దాడి మరువకముందే మరో దాడి జరగడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా ఆదివారం తెల్లవారు జామున బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి (ఫ్రైజిమ్ యజమాని) గడప రాకేశ్‌పై కొందరు యువకులు దాడి చేసిన ఘటన సంచలనం సృష్టించింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు స్థానిక హైటెక్ సిటిలో నివాసం ఉంటున్న రాకేశ్ రోజువారీ విధుల్లో భాగంగా కారులో జిమ్‌కు వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి అతని కారును ఢీకొట్టడంతో కారును ఆపి కిందకు దిగాడు. సుమారు 15 మంది వరకు బైక్‌లపై వచ్చి చుట్టుముట్టి ఇనుప రాడ్స్, బాల్‌స్టిక్స్‌తో దాడి చేశారు. కారును ధ్వంసం చేశారు. స్థానిక రియల్టర్ జగన్‌మోహన్‌రావ్ ఈ దాడి చేయించినట్లు రాకేశ్ ఆరోపించారు. గాయపడిన రాకేష్‌ను స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన మంచిర్యాలకు చెందిన చందు, రవి, సాయికుమార్, గోదావరిఖనికి చెందిన సంజీవ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు.

తాళ్లగురిజాల ఏఎస్సైకి పోలీస్ సేవా పతకం


పతకం అందుకుంటున్న ఏఎస్సై రాజన్న

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న మామిడి రాజన్నకు పోలీసు సేవా పతకం లభించింది. రామగుండం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో రామగుండం సీపీ శ్రీనివాసులు చేతుల మీదుగా సేవా పతకం అందుకున్నారు.

టీఎస్ ఐపాస్‌తో కొత్త పరిశ్రమలు

- త్వరగా అనుమతులు
- ముందుకు వస్తున్న పారిశ్రామికవేత్తలు
- పారిశ్రామికవేత్త వరప్రసాదరావు

పాతమంచిర్యాల: తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి వేగం పుంజుకుందని ప్రముఖ పారిశ్రామిక వేత్త, తెలంగాణ స్టోన్‌వేర్ గ్లేజ్‌డ్ పైప్స్(మట్టి పైపులు) మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వరప్రసాదరావు అన్నారు. తెలంగాణ పదో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటు నిబంధనలపై 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: తెలంగాణ పారిశ్రామిక విధానాలలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

వరప్రసాదరావు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణలో పారిశ్రామిక అనుమతులు సరళతరమయ్యాయి. విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. టీఎస్ ఐపాస్‌తో కొత్త పరిశ్రమలకు త్వరగా అనుమతులు వస్తున్నాయి. దీంతో పరిశ్రమల ఏర్పాటుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు.

ప్రశ్న: పరిశ్రమలకు సబ్సిడీలు అందుతున్నాయా?

వరప్రసాదరావు: స్వరాష్ట్రంలో పరిశ్రమలకు సబ్సిడీలు విడుదల కావడంలేదు. కేవలం ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ విడుదలైంది. దీంతో చిన్న పరిశ్రమలు నిలదొక్కుకోలేక పోతున్నాయి.

ప్రశ్న: విద్యుత్ సరఫరా ఎలా ఉంది?

వరప్రసాదరావు: ఉమ్మడి రాష్ట్రంలో పరిశ్రమలకు విపరీతమైన కరెంటు కోతలు ఉండేవి. జనరేటర్లతో పరిశ్రమలు నడపాల్సి వచ్చేది. తెలంగాణ వచ్చాక ఆ సమస్య తీరింది.

ప్రశ్న: ట్యాక్సుల చెల్లింపులో సమస్యలు ఉన్నాయా?

వరప్రసాదరావు: గతంలో వ్యాట్ సేల్ ట్యాక్సులు 2–4 శాతం ఉండేవి. కేంద్ర ప్రభుత్వం వాటిని 18 శాతానికి పెంచింది, ట్యాక్సుల తగ్గిస్తే మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది.

ప్రశ్న: కొత్తగా పారిశ్రామిక వేత్తలకు ఇచ్చే సలహా..

వరప్రసాదరావు: కొత్తగా పరిశ్రమలు నెలకొల్పాలనుకునేవారు పర్యావరణానికి హాని లేని పరిశ్రమలు నెలకొల్పాలి. ప్రభుత్వం సబ్సిడీలు, వడ్డీ రాయితీలు కల్పించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి.


పి. వరప్రసాదరావు

ఉరుములు.. మెరుపులు.. వాన

మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి/చెన్నూర్ రూరల్/జన్నారం/వేమనపల్లి/భీమిని: ఐదు రోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడుతున్న జిల్లా ప్రజలు ఆదివారం కురిసిన వానతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచే ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంది. అయితే వేడి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో జిల్లా వాసులు ఉపశమనం పొందారు. పాతమంచిర్యాల 8వ వార్డులోని వేపచెట్టు గాలులకు రోడ్డుపై పడింది. జన్నారంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో మోస్తరు వాన కురిసింది. మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన చిటినోజు రాజన్న–శ్యామల ఇంటిపై పిడుగు పడడంతో పైకప్పు రేకులు పగిలిపోయాయి. దీంతో ఇంట్లోని వారు భయంతో పరుగులు తీశారు. ఎంపీటీసీ స్వరూపరాణి, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్ కుమార్ ఇంటిని పరిశీలించారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఇంటిని పరిశీలించి నష్టం అంచనా వేశారు. గాలి దుమారానికి బెల్లంపల్లి శివారులో జాతీయ రహదారిపై ఎదుగా వెళ్తున్న వాహనదారులు ఇబ్బంది పడ్డారు. దుమ్ము ఒక్కసారిగా వాహనాలను కప్పేసింది. రోడ్డు కూడా కనిపించలేదు. గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాసేపటికి పరిస్థితులు మెరుగుపడ్డాయి. తర్వాత అరగంట పాటు చిరుజల్లులు కురిశాయి. గాలివానకు చెన్నూర్ మండలం కిష్టంపేట, చెన్నూర్, మంచిర్యాల ప్రధాన రహదారిపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. జూపాక సడవలి ఇంటి పైకప్పు కొట్టుకుపోయింది. చింతకింది రాజశేఖర్ ఇంటిపై చెట్టు విరిగి పడింది. విద్యుత్ స్తంభం విరిగింది. వేమనపల్లి మండలంలో గాలి, వానకు ఇళ్ల పైకప్పులు కొట్టుకుపోయాయి. విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. జిల్లెడ గ్రామపంచాయతీ శివారులో దాసరి పోశయ్యకు చెందిన గేదె పిడుగుపాటుకు మృతిచెందింది. కన్నెపల్లి మండలం మొక్కంపల్లి(కుర్మగూడం) పిడుగుపాటుకు ఎనిమిది మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మేకలను మేత కోసం ఊరి చివరికి తీసుకెళ్లి మేపుతుండగా సాయంత్రం పిడుగు పడటంతో గాదార్ల కొమురయ్యకు చెందిన 3 మేకలు, బైరి గట్టన్న, గాదార్ల మహేశ్, పోసు, గట్టయ్యకు చెందిన ఒక్కో మేక మృతి చెందాయి. సుమారు రూ.1.10 లక్షల నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

కాసిపేట: కాసిపేట మండలం సోమగూడెం మైదానం సమీపంలో విద్యుత్ తీగ తెగిపోవడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. సాయంత్రం 7:30 గంటల వరకు కరెంటు లేకపోవడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి.

భీమారంలో...

భీమారం మండల కేంద్రంలో సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


జన్నారం: కొట్టుకుపోయిన ఇంటి పైకప్పు


భీమిని : పిడుగుపాటుకు మృతిచెందిన గొర్రెలు


జిల్లా కేంద్రంలో చెట్ల కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది


జన్నారం : రోదిస్తున్న యజమాని శ్యామల


కిష్టంపేట: రహదారిపై విరిగి పడ్డ చెట్లు


కిష్టంపేట: కొట్టుకుపోయిన ఇంటి పైకప్పు


పాతమంచిర్యాలలో కూలిన చెట్టు


కాసిపేట: కురుస్తున్న వర్షం

అర్బన్ పార్కుపై అనిశ్చితి..!


అర్బన్ పార్కుకు శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాలు..

- 30 ఎకరాలు కేటాయింపు
- రూ.5 కోట్లు మంజూరు
- కొర్రీలు పెడుతున్న సింగరేణి యాజమాన్యం
- కొత్త ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలంటున్న పట్టణ ప్రజలు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో తలపెట్టిన అంబేద్కర్ అర్బన్ పార్కు నిర్మాణంపై అనిశ్చితి నెలకొంది. అసలు పార్కు నిర్మాణం అవుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేటాయించిన భూమి ఉంటుందా..? పోతుందా..? సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పార్కు నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి క్లారిటీ లేకపోగ.. తాజాగా సింగరేణి యాజమాన్యం సైతం కొర్రీలు పెడుతోంది. ఈ నేపథ్యంలో పార్కు ఏర్పాటుకు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

2022లో మంజూరు..

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో అర్బన్ పార్కు ఏర్పాటు చేయాలని 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ పార్కు మంజూరు చేసింది. రామకృష్ణాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న 30 ఎకరాల స్థలం కూడా కేటాయించింది. అప్పటి మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, హరీశ్‌రావు, విప్ బాల్కసుమన్ పార్కు నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. బెల్లంపల్లి–గోదావరిఖని వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి ఆర్కే–1 రైల్వేలైన్ వరకు భూమి కేటాయించారు. అర్బన్ పార్కులో పిల్లల పార్కుతోపాటు ఆక్సిజన్ పార్కు, యోగా సెంటర్ ఇలా వివిధ రీతుల్లో అభివృద్ధికి ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో పార్క్ నిర్మాణం నిలిచిపోయింది. దాదాపు ఆరు నెలలుగా పనులు జరుగడం లేదు.

స్థలంపై సింగరేణి కొర్రీ...!

అంబేద్కర్ అర్బన్‌పార్కుకు కేటాయించిన స్థలంపై ఇప్పుడు సింగరేణి కొర్రీలు పెడుతోంది. కేటాయించిన భూమిని తిరిగి తీసుకునే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్కే ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ రెండో దశ పనులు ప్రారంభమైన పక్షంలో.. సదరు భూమి బఫర్ జోన్ కింద తీసుకునే అవకాశముంటుందని సింగరేణి అధికారులు పేర్కొంటున్నారు. రైల్వే ట్రాక్‌కు ఇవతలి వైపు కేటాయించిన భూమి అసలు బఫర్ జోన్‌లోకి వచ్చే అవకాశం లేనప్పటికీ స్థలం వెనక్కి తీసుకుంటామని అధికారులు వాదించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.30 లక్షలు మట్టి పాలేనా..?

అంబేద్కర్ అర్బన్ పార్కుకు అధికారికంగా భూమి, బడ్జెట్ కేటాయింపులు జరగడంతో స్థానిక అధికారులు పనులు మొదలెట్టారు. టెండర్ ప్రక్రియ పూర్తి కానప్పటికీ.. క్యాతనపల్లి మున్సిపాలిటీ నిధులు రూ.30 లక్షలు భూమి చదును కోసం వెచ్చించారు. ఇప్పుడు పనులు ఆగిపోవడంతో మున్సిపల్ నిధులు మట్టిపాలేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఈ పార్క్ నిర్మాణం విషయంలో చొరవ తీసుకుని... క్యాతనపల్లికి ముఖ్యంగా రామకృష్ణాపూర్ పట్టణానికి కొత్త శోభ తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

వడదెబ్బతో ఒకరు మృతి


మహేష్ (ఫైల్)

చెన్నూర్: పట్టణంలోని రజకవాడకు చెందిన నిమ్మల మహేష్ (32) శనివారం రాత్రి వడదెబ్బతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇస్త్రీ షాపునకు వెళ్లి ఇంటికి వచ్చిన మహేష్ అస్వస్థతకు గురై మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

యూరియా కలిసిన నీళ్లు తాగి 18 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెల వద్ద బాధితులు

బెల్లంపల్లిరూరల్: యూరియా కలిసిన నీళ్లు తాగి 18 గొర్రెలు మృతి చెందిన సంఘటన బెల్లంపల్లి మండలం చంద్రవెల్లిలో చోటు చేసుకుంది. బాధితుడు కొమ్ము మల్లేశ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మల్లేశ్ తనకున్న గొర్రెలను మేపేందుకు ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లాడు. వాటి దాహార్తిని తీర్చేందుకు కందుల సత్తయ్యకు చెందిన పొలంలోని బోరు ఆన్ చేశాడు. నీళ్లు వస్తున్న క్రమంలో పొలంలో ఉన్న పాత యూరియా బస్తాలు నీటిలో తడిసిపోయాయి. యూరియా కలిసిన నీటిని తాగిన 18 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మరికొన్ని అపస్మారక స్థితిలోకి వెళ్లాయి. గమనించిన బాధితుడు మండల పశువైద్యాధికారి పావనికి ఫోన్ చేయడంతో సంఘటన స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలోకి చేరిన గొర్రెలకు చికిత్స అందించింది. మృతి చెందిన గొర్రెల విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది. సంఘటనాస్థలాన్ని తాళ్లగురిజాల పోలీసులు పరిశీలించారు.

కాగజ్‌నగర్‌లో చోరీ

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని కాపువాడలో మహ్మద్ సర్దార్ అలీ నివాసంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మహేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. లక్షా 50 వేల రూపాయల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని ఎస్సై పేర్కొన్నారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు.

పాము కాటుతో మహిళ మృతి

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని సుర్దాపూర్ గ్రామానికి చెందిన షేక్ జాహిదా (40) పాము కాటుతో మృతి చెందినట్లు ఎస్సై విజయ్ తెలిపారు. శనివారం రాత్రి తన ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో ఎడమకాలికి కాటు వేసింది. విషయాన్ని భర్త రసూల్‌కు చెప్పడంతో వెంటనే 108లో ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు. భర్తరసూల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శ్రమ బారెడు.. వేతనం మూరెడు

- సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల దుస్థితి
- కంపెనీ వ్యాప్తంగా 25 వేల మంది విధులు
- వేతనాలు పెంచాలని డిమాండ్
- అమలుకు నోచుకోని జీవోలు

ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు.. (రోజు వారీగా)

అన్‌స్కిల్డ్	రూ.523
సెమీస్కిల్డ్	రూ.579
స్కిల్డ్	రూ.637
హైస్కిల్డ్	రూ.693
జీవో 22 ప్రకారం రావాల్సిన వేతనాలు	
అన్‌స్కిల్డ్	రూ.763
సెమీస్కిల్డ్	రూ.916
స్కిల్డ్	రూ.1,035
హైస్కిల్డ్	రూ.1,199
హైపవర్ కమిటీ ప్రకారం వేతనాలు	
అన్‌స్కిల్డ్	రూ.1,176
సెమీస్కిల్డ్	రూ.1,206
స్కిల్డ్	రూ.1,236
హైస్కిల్డ్	రూ.1,266


ఓసీపీలో బెల్ట్ క్లీనింగ్ చేసే కాంట్రాక్ట్ కార్మికులు

కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లు ఇవే..
- జీవో 22 అమలు లేదా కోలిండియాలో అమలవుతున్న హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి.
- కంపెనీ ఆస్పత్రుల్లో కార్మికునితో పాటు కుటుంబ సభ్యులకు ఇన్ పేషెంట్ సేవలు కూడా అందించాలి.
- కంపెనీ లాభాల్లో వాటా చెల్లించాలి.
- వేజ్‌బోర్డులో జరిగిన ఒప్పందాల ప్రకారం లీవులు, పండుగ సెలవులు, ఇతర అలవెన్సులు అమలు చేయాలి.
- ఖాళీ క్వార్టర్లను కేటాయించాలి.
- నర్సరీల్లో పనిచేసే వారికి కూడా సీఎంపీఎఫ్ వర్తింపజేయాలి.
- ప్రమాదవశాత్తు కార్మికుడు మృతి చెందితే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నా వారిలో పావలావంతు వేతనం కూడా రావడంలేదు. 'శ్రమబారెడు.. వేతనం మూరెడు' అన్నట్లుగా ఉంది కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి. సింగరేణి వ్యాప్తంగా గనులు, డిపార్టుమెంట్లలో సుమారు 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. పర్మినెంట్ కార్మికులతో పోల్చితే వీరి సంఖ్య సగం ఉంది. సివిల్, సివిక్, బెల్ట్ క్లీనింగ్, హౌజ్ కీపింగ్, టింబర్ యార్డు, స్టోర్స్, బొగ్గు రవాణా, నర్సరీ, ఓబీ పనుల నుంచి మొదలుకుని అండర్‌గ్రౌండ్‌లో బొగ్గు ఉత్పత్తి అయ్యే చోట కూడా కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. సింగరేణిలో సేవ పనులు మొదలు బొగ్గు ఉత్పత్తిలో కూడా వారితో పనులు చేయించుకుంటున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా శ్రమదోపిడీకి గురిచేస్తున్నారు. కనీస వేతనచట్టం ప్రకారం మూడేళ్లకోసారి వేతనాలు సవరించాల్సి ఉండగా ఇప్పటికీ పదేళ్లు అవుతున్నా వేతనాలు పెరగడం లేదు

జీవో 22 గెజిట్ చేయాలి..

రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలి. ప్రభుత్వం జీవో అయితే ఇచ్చింది కానీ దీని అమలుకు గెజిట్ విడుదల చేయకపోవడంతో ఆ వేతనాలు అమలు కావడం లేదు. అమలు చేయాలని కోరుతూ అన్ని ప్రభుత్వరంగ సంస్థల్లో ఉన్న కాంట్రాక్ట్ కార్మికులు 2023, అక్టోబర్‌లో హైకోర్టును ఆశ్రయించగా అమలు చేయాలని కోర్టు ఆదేశాలిచ్చింది. దీనిపై ప్రభుత్వం కొంత సమయం కావాలని కోర్టును ఆశ్రయించడంతో మళ్లీ అటకెక్కింది.

హైపవర్ కమిటీ వేతనాలైనా..

కోలిండియాలో అమలవుతున్న హైపవర్ కమిటీ వేతనాలైనా సింగరేణిలో అమలు చేయాలని కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ జీవోలో కూడా కొంత ఇబ్బంది ఉంది. కేవలం ప్రొడక్షన్ సైడ్ ఉన్న కాంట్రాక్ట్ కార్మికులకే ఈ హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేసింది. కానీ సింగరేణిలో దీని పరిధిలో కొద్ది మంది మాత్రమే ఉంటారు. ఇక మిగిలిన వారు సివిల్, సివిక్, ఇతర సేవల వైపు ఉండటంతో ఈ జీవో అమలు చేస్తే పూర్తిస్థాయిలో న్యాయం జరగదనే అభిప్రాయం ఉంది. కనీసం ప్రొడక్షన్ వైపు ఉన్నవారికైనా హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేసి మిగిలిన వారికి జీవో 22 అమలు చేయాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆందోళనలు నిత్యకృత్యం..

వేతనాల కోసం కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళనలు, చేస్తున్నా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోంది. 2022 సెప్టెంబర్‌లో సమ్మె చేసి ఆర్‌ఎల్సీ వద్ద చేసుకున్న ఒప్పందం కూడా కంపెనీ అమలు చేయడంలేదని వాపోతున్నారు. తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఉద్యమ సమయంలో కేసీఆర్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఊసే ఎత్తలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా అసెంబ్లీలో చర్చ సందర్భంగా సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులే లేరని ప్రకటన చేయడం కార్మికవర్గానికి ఆగ్రహం తెప్పించింది.

పిల్లల ఫీజులు కూడా ఎల్తలేవ్



2009 నుంచి పనిచేస్తున్నా. నెలకు 23 రోజుల పని దొరికితే రూ.9 వేల వరకు వస్తాయి. ఇప్పటికీ జీతం పెరగలేదు. తినే పప్పు, ఉప్పు, పిరం అయ్యాయి. ఈ జీతంతో పిల్లల బడి ఫీజులు కూడా ఎల్తలేవు. ఈ చాలీచాలని జీతంతో ఎట్ల బతుకుడు.

– కనబోయిన సమ్మయ్య, కాంట్రాక్ట్ కార్మికుడు

వేతనాలు పెంచకుంటే సమ్మెకు సిద్ధం



ఏళ్ల తరబడిగా వేతనాలు పెరుగక కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొత్త ప్రభుత్వమైనా జీవో 22 గెజిట్ ఇవ్వాలి. కోలిండియాలో అమలవుతున్న హైపవర్ కమిటీ వేతనాలు, ఇప్పటి వరకు జరిగిన ఒప్పందాలు, చట్టబద్ధ హక్కులు అమలు చేయాలి. సదుపాయాలు కల్పించాలి. కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెకు దిగుతాం.

– ఎండీ అఫ్రోజ్‌ఖాన్, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి

వికసించిన మే పుష్పం



మందమర్రిరూరల్: పట్టణంలోని మూడో జోన్ రామాలయం వెనుక లైన్‌లోని నడిమెట్ల రమేశ్-అపర్ణ ఇంట్లో ఆదివారం మే పుష్పం వికసించింది. ఏడాదిలో కేవలం మే మాసంలో మాత్రమే ఇది వికసిస్తుంది. అరుదైన ఈ పుష్పాన్ని చూసేందుకు స్థానికులు వస్తున్నారు.

ఇందారం శివాలయంలో చోరీ

జైపూర్: దొంగలు ఆలయాలను సైతం వదిలిపెట్టడం లేదు. జల్సాలకు అలవాటుపడుతున్న వ్యక్తులు ఇళ్లతో పాటు ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. దేవుడి సొమ్మును కూడా కాజేస్తున్నారు. జైపూర్ మండలం ఇందారం శివాలయంలో ఆదివారం పట్టపగలే చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...రోజు వారీగా ఉదయం పూజలు చేసి ఇంటికి వెళ్లిన అర్చకులు సాయంత్రం ఆలయానికి వచ్చి చూడగా దేవుడికి సంబంధించిన బంగారు, వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీధర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి పది వెండి శివలింగాలు, దేవుడి అరతులం బరువు గల బంగారు పుస్తెలు, తులం బరువు గల రెండు వెండి గొలుసులు, శఠగోపం ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించారు. ఆభరణాల విలువ సుమారు రూ.50 వేలకు పైగా ఉంటుందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం


దండేపల్లి: 1996-2001 ప్రైమరీ బ్యాచ్ విద్యార్థులు


మందమర్రిరూరల్: 2006-07 బ్యాచ్ విద్యార్థులు

మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేట్ ఆదర్శ విద్యాలయంలో 2006–07 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. 17 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారు ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన అధ్యాపకులను సన్మానించారు.

దండేపల్లి: మండల కేంద్రంలోని భారతీ విద్యానికేతన్ ప్రైవేటు పాఠశాలలో 1996–2001 ప్రైమరీ బ్యాచ్ విద్యార్థులు అదే పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని మురిసిపోయారు. నాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించారు.

రాష్ట్ర సాధనలో కార్మికులే కీలకం



ఉద్యమకారులను సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికులే కీలకమని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. ఆదివారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన నాటి ఉద్యమకారులు తిరుపతి రాజు, పేరం రమేష్, కొలిపాక సమ్మయ్య, పిన్నింటి మల్లారెడ్డి, నీలం సదయ్య, శేషగిరి, నూనె మల్లయ్య, తోట రాములు, తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జాతీయ సమితి సభ్యులు భీంరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, నాయకులు నర్సింగ్, వెంకటస్వామి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుండి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ షెండే దత్తు ఆసిఫాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై గుండికి వెళ్తుండగా మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


చూడాచక్కాని తల్లి పాటకు డ్యాన్స్ చేస్తున్న సాగర్ టీం సభ్యులు


చిన్నారులను అభినందిస్తున్న జీఎం మనోహర్

మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో జీఎం మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏరియా ఉత్తమ ఉద్యోగి సంతోష్ దంపతులతో పాటు గత విద్యా సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు, యూనియన్ల ప్రతినిధులు, కార్మిక కుటుంబాలు పాల్గొన్నాయి.– మందమర్రిరూరల్


నృత్యం చేస్తున్న చిన్నారులు

గనులపై 'దశాబ్ది' సంబురాలు


శ్రీరాంపూర్: జెండా ఆవిష్కరిస్తున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి


శ్రీరాంపూర్: జెండా ఆవిష్కరిస్తున్న జీఎం సంజీవరెడ్డి


బెల్లంపల్లి: జెండా ఎగురవేస్తున్న గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా


జైపూర్: నివాళులర్పిస్తున్న జీఎం బసివిరెడ్డి


రెబ్బెన: విగ్రహానికి పూలమాల వేస్తున్న జీఎం


మందమర్రిరూరల్: జెండా ఆవిష్కరిస్తున్న ఏరియా జీఎం మనోహర్

శ్రీరాంపూర్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం సింగరేణి ఏరియాలో ఘనంగా జరుపుకున్నారు. నస్పూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ సుర్మిళ్ల వేణు జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ సాధించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

నస్పూర్ షిర్కే చౌరస్తాలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మిర్యాల రాజేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి లింగం రవి, నాయకులు కొట్టె కిషన్‌రావు, మోత్కూరి కొమురయ్య, నాయకులు రవీందర్, లచ్చిరెడ్డి, సందీప్ నర్సింగరావు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో..

శ్రీరాంపూర్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచి ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, నాయకులు బండి రమేష్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, గొర్ల సంతోష్, అన్వేష్‌రెడ్డి, మైపాల్, వికాస్, దుర్గం రవి, పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీలో..

సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు జాతీయ జెండాను ఎగురవేశారు.

త్యాగాల పునాదులపై తెలంగాణ

త్యాగాల పునాదులపై తెలంగాణ ఏర్పడిందని శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి అన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నస్పూర్ కాలనీ జాతీయ రహదారిపై తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేశారు. షిర్కే, కార్మిక వాడల మీదుగా ర్యాలీ నిర్వహించారు. మహిళలు బతుకమ్మలతో ర్యాలీలో పాల్గొన్నారు. జీఎం కార్యాలయం వద్ద ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి, అమరుల స్తూపానికి జీఎం పూల మాలవేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్ గోపాల్‌సింగ్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, అనంద్‌కుమార్, ఆయా గనుల మేనేజర్లు, డిపార్టుమెంట్ల ఉన్నతాధికారులు, సేవాసభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

ప్రగతి మైదానంలో జీఎం సంజీవరెడ్డి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి గాలిలో బెలూన్లు వదిలి వేడుకలను ప్రారంభించారు. ఉత్తమ ఉద్యోగులు, ఉత్తమ సేవా కార్యకర్తలను సన్మానించారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం అరవిందరావు పాల్గొన్నారు.

శాంతిఖని గనిపై...

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు తెలంగాణ అమరుల చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు. సింగరేణి ఏరియా ఆస్పత్రి వద్ద ఇన్‌చార్జి డీవైసీఎంవో డాక్టర్ ఏఎస్ఎస్ రాధాకృష్ణ త్రివర్ణ పతాకం ఎగురవేశారు. కార్యక్రమాల్లో గ్రూప్ ఇంజనీర్ బసవరాజు, సీనియర్ అండర్ మేనేజర్లు నాగవర్ధన్, పూర్ణచందర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ శాంతిఖని అసిస్టెంట్ సెక్రెటరీ మంతెన రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో మందమర్రి జీఎం మనోహర్ జాతీయ పతాకం ఎగురవేశారు. కార్యక్రమంలో సీఎంవోఏ ఏరియా అధ్యక్షుడు రమేశ్, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ, తదితరులు పాల్గొన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జంగం కళ జెండా ఆవిష్కరించారు. కమిషనర్ మురళీకృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఏరియా జీఎం మనోహర్ జాతీయ జెండాను ఎగురవేశారు. సింగరేణి అభివృద్ధి చెందితే రాష్ట్రం, దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్టీపీపీలో ఉదయం తెలంగాణ రన్ నిర్వహించారు. అనంతరం అడ్మిన్ భవన కార్యాలయం వద్ద జీఎం బసివిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి పాత్ర ఎంతో కీలకం

రెబ్బెన(ఆసిఫాబాద్): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి పాత్ర ఎంతో కీలకమని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ అన్నారు. జీఎం కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం కార్మిక కాలనీల్లో తెలంగాణరన్ నిర్వహించారు. గ్రంథాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈకార్యక్రమాల్లో ఎస్‌వోటూ జీఎం నరేందర్, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.


శ్రీరాంపూర్: ఉత్తమ సేవా కార్యకర్తను సన్మానిస్తున్న జీఎం దంపతులు


రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న జీఎం